
క్లుప్తంగా

అయ్యప్ప స్వామికి ఉత్తర నక్షత్ర పూజలు


విశేష అలంకరణలో స్వామివారు

అల్లిపురం : టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన శ్రీ ధర్మశాస్త ఆలయంలో అయ్యప్పస్వామికి గురువారం ఉత్తర నక్షత్ర పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు భార్గవశర్మ ఈ సందర్భంగా విశేష అభిషేకాలు, అలంకరణ చేపట్టారు. పూజల అనంతరం భక్తులకు అయ్యప్ప స్వామి దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా అయ్యప్పలు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది.

ర్యాంపు పనుల పరిశీలన


ర్యాంపు పనులు పరిశీలిస్తున్న తోట పద్మావతి తదితరులు

అల్లిపురం : జీవీఎంసీ 34వ వార్డు పరిధిలోని కాన్వెంట్ జంక్షన్‌లో గెడ్డపై ర్యాంపు నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి గురువారం పనులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గెడ్డపై కల్వర్టు పాడవటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. సుమారు రూ.5 లక్షలతో ర్యాంపు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఆమె వెంట పార్టీ సీనియర్ నాయకులు లండా రమణ, దూడ అప్పారావు, పిల్లి సత్తిబాబు, సూరిబాబు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి చక్కని స్పందన


స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

జగదాంబ : స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి చక్కటి స్పందన లభించింది. గురువారం స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ సూర్యతేజ బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. అనంతరం రోగులకు పలు సూచనలు చేశారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా మందులు వేసుకోవాలని, వ్యాయామం చేయాలని, ఆహార నియమాలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు అప్పారావు, ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన


అర్చనలందుకున్న అమ్మవారు

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం సహస్ర తులసీ దళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనాలనుకునే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల పెన్నిధి.. సంక్షేమ సారథి


సుబ్బలక్ష్మీనగర్‌లో జగనే మళ్లీ సీఎం కావాలంటూ నినాదాలు చేస్తున్న మహిళలు


సుబ్బలక్ష్మీనగర్‌లో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కార్పొరేటర్ పూర్ణిమ

- అందుకే మళ్లీ జగనే సీఎం కావాలి
- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్
- 29,41 వార్డుల్లో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం నిర్వహణ

కంచరపాలెం : సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు జనం జేజేలు పలుకుతున్నారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 41వ వార్డు సుబ్బలక్ష్మినగర్‌లో వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ ఆధ్వర్యంలో గురువారం జరిగిన 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వాసుపల్లి ప్రారంభించారు. ముందుగా సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టి పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో అర్హులైన అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు, అవ్వాతాతలకు ఎలాంటి వివక్ష, లంచాలకు తావు లేకుండా సంక్షేమ పథకాలు అందించారన్నారు. విద్య, వైద్య రంగాలను బలోపేతం చేసిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు. జగనన్న సురక్షతో పేదల చెంతకే వైద్యాన్ని తీసుకెళ్లిన నేత జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. సుబ్బలక్ష్మీనగర్-2 సచివాలయం పరిధిలో అర్హులైన లబ్ధిదారులకు రూ.5.80 కోట్ల మేర లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. గత ప్రభుత్వ పాలనకు, నేటి జగనన్న పాలనకు మధ్య గల వ్యత్యాసం చూడాలన్నారు. ప్రదలందరికీ సంక్షేమ ఫలాలు అందించాలనే ఉద్దేశ్యంతో ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారని.. పేదల పెన్నిధిగా నిలిచిన జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు వీసం రామకృష్ణ, జోన్-5 అసిస్టెంట్ కమిషనర్ (రెవెన్యూ) బాబూరావు, క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్, కో-ఆప్షన్ సభ్యుడు షరీఫ్, మండల పార్టీ అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్, దొడ్డి రామానంద్, వేళంగినిరావు, అన్నపూర్ణ, దేవి, కుమార్, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో ఎ.సునీల్‌కుమార్, ఏపీడీ పద్మావతి, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, సీవోలు, ఆర్పీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

29వ వార్డు దండుబజార్‌లో..

మహారాణిపేట : 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం 29వ వార్డు దండుబజార్ చందక వీధిలో నిర్వహించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రూపొందించిన సంక్షేమ పథకాల బోర్డును ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆవిష్కరించారు. అనంతరం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే ప్రచార కార్యక్రమంలో భాగంగా జెండా ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గత నాలుగేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి పథకాలను వివరించారు. ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) మొత్తం 6 కోట్ల 24 లక్షలు, పరోక్ష ప్రయోజనాలు (నాన్ డీబీటీ) 6 కోట్ల 89 లక్షలు కలిపి 29వ వార్డు సచివాలయం పరిధిలో మొత్తం 13 కోట్ల 13 లక్షల వ్యయంతో ఎలాంటి వివక్ష లేకుండా అర్హులందరికీ లబ్ధి చేకూర్చారన్నారు. అందుకే మళ్లీ జగనే రాష్ట్రానికి సీఎం కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకుడు వీసం రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు పీతల వాసు, క్లస్టర్ ఇన్‌చార్జి కోన శంకర్, దొడ్డి రామానంద్, స్టేట్ డైరెక్టర్ నీలాపు లక్ష్మి, ఇతర నాయకులు పెంటపల్లి సత్యనారాయణ, బుల్లెట్ రవి, కోరాడ సురేష్, బెవర మహేష్, అడపా శివ, జోన్-4 కమిషనర్ శివప్రసాద్, ఏపీడీ పుణ్యవతి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


దండుబజార్‌లో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

ఎమ్మెల్యే వాసుపల్లి ఔదార్యం


రంగిరీజువీధిలో పెంటమ్మకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి


38వ వార్డులో పక్షవాతంతో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే

దాబాగార్డెన్స్ : ప్రజాదర్బార్‌లో వైద్య సాయం కోసం వచ్చిన అర్జీలపై ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ స్పందించారు. తన సొంత నిధుల నుంచి ఆరుగురికి రూ. 30 వేలు అందజేశారు. 38వ వార్డు కంచరవీధికి చెందిన కిసన సుధాకర్ పక్షవాతంతో బాధపడుతున్న దృష్ట్యా మందుల కోసం రూ.5 వేలు, అదే వార్డు గాంధీబొమ్మ ప్రాంతానికి చెందిన రిట్ట వెంకటరమణ పక్షవాతంతో మంచం పట్టడంతో మందుల కొనుగోలుకు రూ. 5 వేలు అందజేశారు. 39వ వార్డు థామ్సన్‌వీధికి చెందిన ఒనుము కనకరాజు ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో పెద్ద కర్మ కోసం రూ.5 వేలు అందజేశారు. అంబుసరంగ్ వీధికి చెందిన మహ్మద్ యమనశా కిడ్నీ సమస్యతో బాధపడుతున్న దృష్ట్యా రూ.5 వేలు అందజేశారు. 36వ వార్డు రంగిరీజువీధికి చెందిన వడ్డాది త్రినాథ్ యూరాలజీ సమస్యతో బాధపడుతున్న దృష్ట్యా మందుల కొనుగోలుకు రూ.5 వేలు, బ్లడ్ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న గుమ్మిడి పెంటమ్మకు మందుల కొనుగోలుకు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు కార్పొరేటర్లు, పలు వార్డుల అధ్యక్షులు, జేసీఎస్ ప్రెసిడెంట్లు, ఇన్‌చార్జిలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ఆయా వార్డుల నాయకులు పాల్గొన్నారు.

యూజీడీ సమస్య పరిష్కారం

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డులో కార్పొరేటర్ చొరవతో యూజీడీ సమస్య పరిష్కారం అయింది. దుర్గమాంబ సమాజంలో ప్రజలు గత కొన్ని నెలలుగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యతో బాధపడుతున్నారు. గురువారం వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు వద్దకు ఆ వీధి మహిళలు, యువకులు వచ్చి యూజీడీ సమస్యతో పడుతున్న ఇబ్బందులు వివరించారు. దీనిపై స్పందించిన విల్లూరి వెంటనే సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి సమస్య ఉన్న ప్రాంతానికి తీసుకువచ్చి పనులు ప్రారంభింపజేశారు. దీంతో యూజీడీ సమస్య పరిష్కారమయింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ విల్లూరి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు, కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.


యూజీడీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ భాస్కరరావు

లేపాక్షిలో దీపావళి దియాస్


టెర్రకోట, డిజైనర్ ప్రమిదలు


లక్ష్మీదేవి, గణపతి బొమ్మలతో ప్రమిదలు

దాబాగార్డెన్స్ : వెలుగుల పండగ దీపావళి సందర్భంగా ఎన్నెన్నో డిజైనర్ దీపాలు నగర ప్రజల అందుబాటులో ఉంచినట్లు లేపాక్షి ఎంపోరియం మేనేజర్ కార్తీక్‌కుమార్ తెలిపారు. లక్ష్మీదేవి, గణపతి మట్టి బొమ్మలతో రెండు.. మూడు స్టెప్పుల్లో రూపొందించిన ప్రమిదల ప్రదర్శన, విక్రయాలు ఈ నెల 11 వరకు ప్రతిరోజూ ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటాయన్నారు. కలశం, డిజైనర్ దీపాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయని తెలిపారు. ఒకే ప్రమిదపై ఐదారు ఒత్తులతో దీపాలు వెలిగించుకునేలా సరికొత్త ప్రమిదలు కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు. టెర్రకోట ప్రమిదలతో పాటు ఢిల్లీ డిజైనర్ ప్రమిదలు, కోల్‌కతా ప్రమిదలు కూడా అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. లేపాక్షిలో టెర్రకోట మట్టి ప్రమిదల విక్రయాలు గత ఎనిమిదేళ్లుగా చేపట్టినట్లు తెలిపారు. ఇవి కేవలం లేపాక్షిలోనే లభ్యమవుతాయన్నారు. తడిగుడ్డతో తుడిచినా ప్రమిదలు పాడవ్వవని, నూనె ఎక్కువగా పీల్చవని, ఒకసారి ఉపయోగించిన తర్వాత వాటిని భద్రపరచుకోవచ్చని తెలిపారు. నగర ప్రజలు వినియోగించుకోవాలని కార్తీక్‌కుమార్ కోరారు.

విద్యార్థినులకు అభినందన


విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

అల్లిపురం : ఇంటర్ కాలేజీ వాలీబాల్ పోటీల్లో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు తృతీయ స్థానం సాధించారు. ఈ నెల 7వ తేదీన డాక్టర్ వీఎస్ కృష్ణా కాలేజీలో జరిగిన ఆంధ్రా యూనివర్సిటీ, ఇంటర్ కాలేజీ వాలీబాల్ టోర్నమెంట్‌లో విద్యార్థినులు ఈ ఘనతను సాధించారు. ఈ సందర్భంగా గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి, స్టాఫ్ కమిటీ సభ్యులు డాక్టర్ కేఎల్ శిరీష, ఎస్.అనురాధ విద్యార్థినులను అభినందించారు.

లేడీస్ పిక్నిక్ పోస్టర్ ఆవిష్కరణ


లేడీస్ పిక్నిక్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్ హరివెంకటకుమారి తదితరులు

అల్లిపురం : అంతర్జాతీయ ఈవెంట్ నిర్వాహకులు వీరుమామ, వైజాగ్ ఉమెన్ ఫోరమ్ ఆధ్వర్యంలో ఈ నెల 22న ఎంజీఎం పార్క్‌లో జరగనున్న లేడీస్ పిక్నిక్ పోస్టర్‌ను మేయర్ గొలగాని హరి వెంకట కుమారి గురువారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశాఖలో గల మహిళలు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు. నిర్వాహకుడు వీరుమామ మాట్లాడుతూ లేడీస్ పిక్నిక్ విశాఖలో నాల్గవ సారి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి మహిళకు ఒక రోజు పూర్తిస్థాయి వినోదాన్ని అందించే విధంగా ఈ పిక్నిక్ రూపొందించినట్లు తెలిపారు. 20 గేమ్స్, 300 బహుమతులు, విందు భోజనంతో కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పద్మజ, ఝాన్సీ, భారతి పాల్గొన్నారు.

జిల్లా ప్రగతిపై సదస్సు నేడు

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఏయూ అలుమ్ని హాలులో 'ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి–విశాఖపట్నం జిల్లా ప్రగతి'అనే అంశంపై సదస్సు జరగనుంది. వివిధ రంగాల్లో నిష్ణాతులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించనున్నట్టు ఏపీడబ్ల్యూజేఎఫ్ విశాఖ అధ్యక్షుడు పి.నారాయణ్ ఒక ప్రకటనలో తెలిపారు.

డిసెంబర్‌లో కోటి ఒత్తుల దీపోత్సవాలు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న విరాట్ హిందూ సంఘ్ ప్రతినిధులు

సింహాచలం: విరాట్ హిందూ సంఘ్ ఆధ్వర్యంలో డిసెంబర్ 8,9,10 తేదీల్లో సింహాచలంలో కోటి ఒత్తుల దీపోత్సవాలు నిర్వహిస్తున్నట్టు విశాఖకు చెందిన హిమాలయ సార్వపీఠాధిపతి ప్రభాకర్ యోగి తెలిపారు. సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తొలిపావంచా వద్ద కార్యక్రమాల వివరాల కరపత్రాన్ని ఆయన గురువారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రభాకర్‌యోగి మాట్లాడుతూ సర్వజనులు సుఖశాంతులతో ఉండాలన్నా...ఆనందంతో జీవించాలన్నా సనాతన ధర్మం ఒక్కటే మార్గమని తెలిపారు. సనాతన భారతీయ ధర్మాన్ని రక్షించుకునే క్రమంలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తొలిపావంచా వద్ద, హవేలీ గ్రౌండ్‌వద్ద, వరాహపుష్కరిణి వద్ద కోటి ఒత్తుల దీపోత్సవ మహోత్సవాలను నిర్వహించనున్నట్టు చెప్పారు. డిసెంబర్ 8న నగరంలోని జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయం నుంచి సింహాచలంలోని తొలిపావంచా వరకు భారీ ఎత్తున భారీకలశ యాత్ర నిర్వహిస్తామన్నారు. విరాట్ హిందూ సంఘ్ ప్రతినిధులు మీసాల రవీంద్ర, పూడిపెద్ది శర్మ, నమ్మి రాజగోపాల్, భీశెట్టి నాగభూషణం, కాళ్ల జగన్‌మోహన్, ఆర్.జయరాజ్, జ్యోతి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై ఆరా తీయాలి

దాబాగార్డెన్స్ : ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమానికి సంబంధించి నియోజకవర్గం క్లస్టర్ ఇన్‌చార్జి పీతల వాసు గురువారం జిల్లా పరిషత్ సమీపాన గల ఓ హోటల్లో 28, 29, 30, 37 వార్డులకు సంబంధించి గృహ సారథులు, కన్వీనర్లతో సమావేశమై కార్యక్రమ నిర్వహణపై చర్చించారు. ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో 30వ వార్డు కార్పొరేటర్ కొండమ్మ, నాయకులు, కార్యకర్తలు సత్యనారాయణ, నీలాపు లక్ష్మి, ఎర్రబెల్లి ప్రభాకర్, పోతుస్వామి, బెవర మహేష్, కోరాడ సురేష్, వడ్డాది దిలీప్, అడపా శివ, దశమంతుల చిన్ని, ఆనంద్, కనకల రాజు, ఆకుల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం


ధర్మకర్తల మండలి సభ్యులతో ఎమ్మెల్యే వాసుపల్లి, కోలా గురువులు తదితరులు

అల్లిపురం : అస్సాం గార్డెన్స్‌లోని టూటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో గల శ్రీ శివరామకృష్ణ దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రమాబాయి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా ఆలయ అర్చకుడు భార్గవశర్మ పూజలు చేశారు. సభ్యులుగా నీలాపు రమణారెడ్డి, సీహెచ్ దుర్గా భవాని, కె. ధనలక్ష్మి, ఎల్.ఆనందకుమార్, జి. అరుణకుమారి, టి. రాము, అంజలి, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా బి.సాయికృష్ణశర్మ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నీలాపు వెంకట రమణారెడ్డిని సభ్యులు చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ చైర్మన్‌కు, సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో సత్కరించారు. పాలక మండలిలో స్థానం సంపాదించుకున్న సభ్యులు అధికారులు, స్థానికులతో కలిసి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. చైర్మన్ నీలాపు వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సహకారంతో స్వామివారి సేవ చేసుకునే భాగ్యం కలిగిందన్నారు. మండల ప్రెసిడెంట్ దొడ్డి బాపు ఆనంద్, కర్రి నీలకంఠం, క్లస్టర్ ఇన్‌చార్జి దొడ్డి రామానంద్, పాలక మండలి సభ్యులు, 35వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అలపన కనకరెడ్డి, సీనియర్ నాయకులు ఆదివిష్ణు, బొడ్డేటి ప్రసాద్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ లోగో ఆవిష్కరణ


లోగో ఆవిష్కరిస్తున్న వికాస్ పాండే

దాబాగార్డెన్స్ : జాతీయ స్థాయిలో నూతనంగా ప్రారంభించిన కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ లోగోను నగరంలోని ఓ హోటల్లో సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వికాస్ పాండే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ మందికి సేవలందించాలనే ఆలోచనతో ఈ సంస్థ ప్రారంభించినట్టు చెప్పారు. రాష్ట్రంలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, విజయవాడ, కడప వంటి ప్రాంతాల్లో వినియోగదారుల తరఫున ఎన్నో కేసులు నమోదు చేశామన్నారు. అలాగే తెలంగాణతో పాటు బీహార్ తదితర రాష్ట్రాల్లో కూడా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. చాలా మందికి కోర్టుల ద్వారా న్యాయం జరిగిందని చెప్పారు. సేవలు మరింత విస్తృతం చేయడానికి సొంతంగా జాతీయ స్థాయిలో కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్‌ను ప్రారంభించామన్నారు. వినియోగదారుల హక్కుల కోసం పోరాడేందుకు సంస్థ పని చేస్తుందన్నారు. ఎవరికైనా అన్యాయం జరిగితే తమను సంప్రదిస్తే ఒక్క రూపాయి ఖర్చు కాకుండా కోర్టులో కేసు వేసి వారికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. వినియోగదారుల సలహాలు, సహకారానికి 9963633653 నంబర్‌కు కాల్ చేసి ఉచితంగా సేవలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రసాదరాజు, చాంద్, చంద్రశేఖర్, కుమార్, సాగర్, చంద్రమౌళి, అడ్వకేట్ వెంకటలక్ష్మి, శంకర్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట చర్యలతోనే రైల్వే భద్రత



సెమినార్‌లో మాట్లాడుతున్న కె.సి.జేమ్స్

కంచరపాలెం: రైల్వే భద్రత అంశాలపై ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ (ఏఐఎల్ఆర్ఎస్ఏ) ఆధ్వర్యంలో గురువారం కంచరపాలెం బొట్టా నర్సింగరావు భవనంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.సి.జేమ్స్ మాట్లాడుతూ ఇటీవల కేపీఎల్-ఏఎల్ఎం సెక్షన్ మధ్య పలాస-రాయగడ ప్యాసింజర్లు ఢీకొన్న సంఘటన అత్యంత దురదృష్టకరమన్నారు. ఈ విషాద ఘటన తర్వాత రైల్వేలో భద్రత అనేది ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదంలో మరణించిన రైల్వే ఉద్యోగులతోపాటు ప్రయాణికులకు సంతాపాన్ని తెలియజేశారు. ప్రమాదానికి గల కారణాలేమిటో కాకుండా.. ఎవరు బాధ్యులన్న ఉద్దేశంతో రైల్వే అధికారులు ప్రమాదాలపై ఆరా తీస్తున్నారన్నారు. జోనల్ అధ్యక్షుడు ఎస్.కె.చౌబే, కార్యదర్శి బోలేనాథ్ మాట్లాడుతూ సేఫ్టీ కేటగిరీలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకపోవడంతో సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతోందన్నారు. రైళ్లను సురక్షితంగా నడిపేందుకు రైల్వే యంత్రాంగం, ప్రభుత్వం వెంటనే పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కుమార్, జగన్, పబ్లిక్ సెక్టార్ కన్వీనర్ ఎం.శ్రీనివాస్, కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల కన్వీనర్ రెడ్డి వెంకటరావు, ఏఐఎల్ఆర్ఎస్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.వి.ఎస్.రాజు ప్రసంగించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చిన్నోడు, పాణిగ్రాహి, హరికృష్ణ, సంతోష్, ఇంద్రజిత్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వజన్మ సుకృతం వల్లే ఆధ్యాత్మిక చింతన


అన్నసమారాధనను ప్రారంభిస్తున్న డాక్టర్ పీవీ రమణమూర్తి తదితరులు

అల్లిపురం : ఆధ్యాత్మిక చింతనతో జీవించగలగటం పూర్వజన్మ సుకృతమని ప్రముఖ వైద్యులు, కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ పీవీ రమణమూర్తి అన్నారు. కెప్టెన్ రామారావు జంక్షన్‌లో గల శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి దేవాలయం ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు పంపాన గణేష్ జన్మదినం సందర్భంగా గురువారం ఆలయంలో నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, ముఖ్య సలహాదారు బొడ్డేటి ప్రసాద్, కార్యదర్శి బొడ్డు పోలారావుతో కలిసి పంపాన గణేష్ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు పీల వెంకట అప్పలనాయుడు, సత్యనారాయణ, వాసుపల్లి నారాయణ, బడే నాగరాజు, పాకలపాటి అప్పారావు, వాసుపల్లి నర్సింగ్, తమ్మరపు మధు తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై ట్రాఫిక్ పోలీస్ అవుట్ పోస్ట్ ప్రారంభం


అవుట్ పోస్టును ప్రారంభిస్తున్న దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, సీఐ అశోక్‌కుమార్

సింహాచలం: సింహగిరిపై ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పోలీస్ అవుట్ పోస్టు కేంద్రాన్ని గురువారం సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్ మాట్లాడుతూ సింహగిరిపై మే ఐ హెల్ప్ యు కేంద్రానికి సమీపంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం నుంచి మైకు ద్వారా వాహనాల నియంత్రణ, పార్కింగ్ ప్రదేశాలు తదితర అంశాలను భక్తులకు తెలియజేస్తామన్నారు. గోపాలపట్నం ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్, దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, సువ్వాడ శ్రీదేవి, ముదుండి రాజేశ్వరి, దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు పాల్గొన్నారు.

ఉద్యోగార్థులకు క్విజ్ పోటీలు

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం ఉద్యోగార్థులకు పోటీ పరీక్షల నమూనా క్విజ్ పోటీలు జరిగాయి. గ్రంథాలయ సభ్యులు, బీవీకే, ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థులు 60 మంది పాల్గొన్నారు. వర్తమాన అంశాలు, చరిత్ర, ఆర్థిక విజ్ఞాన శాస్త్రం, భూగోళ శాస్త్రం, రాజ్యాంగం తదితర అంశాలపై 8 వృత్తాల్లో 60 వరకు ప్రశ్నలు అడిగారు. లైబ్రేరియన్ దుర్గారాణి మాట్లాడుతూ ఈ పోటీల్లో విజేతలకు ఈ నెల 14న జరిగే గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభోత్సవంలో బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఇటువంటి క్విజ్ పోటీలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పోటీలకు డాక్టర్ డి.వి.సూర్యారావు క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించారు.